# I. కొత్త ఆదాయపు పన్ను బిల్లు విస్తృత పరిధి

## తరచుగా అడిగే ప్రశ్నలకు సమాధానాలు

### ప్రశ్న I.1 ప్రస్తుత ఆదాయపు పన్ను చట్టం ఎప్పుడు ఆమోదం పొందింది?

**జవాబు:** ప్రస్తుత ఆదాయపు పన్ను చట్టాన్ని 1961లో రూపొందించారు. 1962 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. పన్ను విధానంలో మార్పుల ఆవశ్యకత ఆధారంగా ఆర్థిక చట్టాల ద్వారా ఏటేటా దీనికి సవరణలు చేస్తూ వచ్చారు. దాదాపు 65 సార్లు 4000కు పైగా సవరణలు చేశారు.

### ప్ర I.2 ఆదాయపు పన్ను చట్టం-1961కి సంబంధించి ఎలాంటి ఆందోళనలు వ్యక్తమయ్యాయి?

**జవాబు:** మొత్తంగా పన్నుల నిర్వహణకు, ఆర్థిక వ్యవస్థకు ఈ ఆదాయపు పన్ను చట్టం-1961 ఉపకరిస్తోందని నిర్వాహకులు, సంబంధిత వృత్తి నిపుణులు, పన్ను చెల్లింపుదారులు చెబుతున్నారు. అయినప్పటికీ ఆదాయపు పన్ను చట్టానికి జరిగిన అనేక సవరణలు, సంక్లిష్ట భాష, విస్తృత నిబంధనలు, చట్టంలో పునరుక్తులు, భారీ పరిమాణంపై కాలక్రమేణా ఆందోళనలు కూడా వ్యక్తమయ్యాయి.

### ప్ర I.3 ఇతర చట్టాల్లా కాకుండా, ఆదాయపు పన్ను చట్టంలో ఎప్పటికప్పుడు సవరణలు చేయడానికి కారణాలు ఏమిటి?

**జవాబు:** ఆదాయపు పన్ను చట్టం మార్పులకు లోనయ్యేది. మారుతున్న దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నవీకరణలు, సవరణలు అవసరం. క్రిమినల్, ఇతర సివిల్ చట్టాలకు ఇంత తరచుగా నవీకరణలు, సవరణలు జరగవు. అయితే ఆర్థిక మార్పులు, ద్రవ్య విధానాలు, ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా ఆదాయపు పన్ను చట్టానికి ఎప్పటికప్పుడు (వార్షిక ప్రాతిపదికన) నవీకరణలు జరుగుతాయి. అందువల్ల ఇది ఆర్థిక వ్యవస్థ, వ్యాపార పరిస్థితులు, ద్రవ్యోల్బణ రేట్లు, ఆదాయ వనరులు, అంతర్జాతీయ ఆర్థిక ధోరణుల్లో మార్పులకు అనుగుణంగా ఉంటుంది. ప్రభుత్వం పన్ను సంస్కరణలను ప్రవేశపెట్టడం ద్వారా ఆర్థిక వ్యవస్థలోని నిర్దిష్ట రంగాలను ప్రోత్సహిస్తూనే.. అదే సమయంలో పన్ను వసూలు, పన్ను పరిధి విస్తరణ ఆవశ్యకతలనూ సమతౌల్యం చేసింది. పన్నులు, ఆర్థిక పరిస్థితులతో ఈ చట్టానికి ప్రత్యక్ష సంబంధం ఉంది. అందువల్ల ఆర్థిక విధానాల్లో మార్పు, ఆదాయాల్లో మార్పు, ద్రవ్యోల్బణం, పెరుగుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఇది మరింత అనుకూలంగా ఉండాలి. ఆదాయపు పన్ను

చట్టానికి గల ఈ ప్రత్యేకత వల్ల ఎప్పటికప్పుడు పుట్టుకొచ్చే ఆర్థిక అవసరాలకు అనుగుణంగా మారగల సౌలభ్యాన్ని దానికి అందిస్తుంది.

**ఉదాహరణలు**:

**i.** ఎగుమతులను ప్రోత్సహించడానికి 80 HH, 80 HHC వంటి నిర్దిష్ట నిబంధనలను చట్టంలో చేర్చారు.

**ii**. ఉద్దేశించిన ప్రయోజనం నెరవేరిన తర్వాత వాటిని తొలగించారు, లేదా నిర్దిష్ట వ్యవధి అనంతరం అవి వర్తించకుండా చేశారు.

**iii.** మౌలిక సదుపాయాల అభివృద్ధిని ప్రోత్సహించడానికి, సెక్షన్ 80IAను ఆదాయపు పన్ను చట్టం-1961లో చేర్చారు.

**iv**. సాఫ్ట్ వేర్ ఎగుమతుల కోసం 80 HHE, 10A, 10AA సెక్షన్లను చట్టంలో చేర్చారు. అంకుర సంస్థలను ప్రోత్సహించే సెక్షన్ 80 IAC మరో ఉదాహరణ.

## Q I.4 ఆదాయపు పన్ను చట్టం-1961 కాలక్రమేణా ఇంత పెద్దదిగా ఎందుకు మారింది?

**జవాబు:** సంప్రదాయ శైలిలో రచన, అనేక సవరణల వల్ల కాలక్రమేణా ఆదాయపు పన్ను చట్టం విస్తృతమవుతూ వచ్చింది. ప్రస్తుత చట్టంలో భాషా సంక్లిష్టతకు వివిధ కారణాలున్నాయి. నిర్దిష్ట చట్టపరమైన ప్రకటనలకు అనుగుణంగా ఉండేలా ఎప్పటికప్పుడు వివరణలను, షరతులను చేర్చడం ద్వారా చట్టం ఉద్దేశాన్ని స్పష్టం చేశారు. పన్ను ప్రాధాన్యాల్లో మార్పుల వల్ల కూడా సరళంగానే ఉండే నిబంధనలకు అదనపు పాఠాన్ని జోడించాల్సి వచ్చింది. అంతేకాకుండా కిందటి సంవత్సరాల్లో అపరిష్కృతంగా ఉన్న క్లెయిమ్ లు/అంశాల దృష్ట్యా కొన్ని నిబంధనలు అమల్లో లేనప్పటికీ చట్టంలో ఉన్నాయి.

## ప్ర I.5 దీనిని సరళీకృతం చేయడానికి గతంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

**జవాబు:** 2009, 2019 సంవత్సరాలతోపాటు గతంలో అనేక సార్లు ఆదాయపు పన్ను చట్టాన్ని సరళతరం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. ఎప్పటికప్పుడు చేపట్టిన సవరణల్లో ఈ విధానపరమైన చర్యల ద్వారా అందిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్నారు.

## ప్ర I.6 ఇదే తరహా కసరత్తు చేపట్టిన ఇతర దేశాల అంతర్జాతీయ అనుభవాన్ని

**ప్రస్తుత సరళీకరణ ప్రయత్నాల్లో పరిగణనలోకి తీసుకున్నారా?**

**జవాబు:** పన్ను చట్టాల సరళీకరణ ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. పన్ను చట్టాల్లో స్పష్టత, ఆచరణీయతను మెరుగుపరచడం కోసం వివిధ దేశాలు ఈ తరహా కసరత్తులు చేపట్టాయి.

భాషను సరళతరం చేయడం కోసం యూకేలో 1994 నుంచి 2010 వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. సరళీకరణకు ముందు యూకే ఆదాయ, కార్పొరేషన్ పన్ను చట్టం-1988లో 960 పేజీలుండేవి. సరళీకరించిన తర్వాత దీనిని అయిదు ప్రత్యేక చట్టాలుగా విభజించారు. అయితే వాటి పేజీల సంఖ్య పెరిగింది. ఆ విధంగా, మొత్తంగా చూస్తే విభజించినప్పటికీ పన్ను చట్టం పరిమాణం పెరిగింది.

1994 నుంచి 1997 వరకు ఆస్ట్రేలియా కూడా ఇలాంటి ప్రక్రియనే చేపట్టింది. అక్కడ కూడా భాషను సరళీకరించడం వల్ల పన్ను నియమావళి సుదీర్ఘంగా మారింది.

స్పష్టమైన, సందిగ్ధం లేని చట్టపరమైన భాష ఆవశ్యకతకూ.సరళీకరణకూ మధ్య సునిశితమైన సమతౌల్యాన్ని ఈ అంతర్జాతీయ అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. వీటిని పాఠాలుగా గ్రహించి, కేవలం భాష సరళీకరణపై మాత్రమే కాకుండా నిర్మాణాత్మక హేతుబద్ధీకరణపై కూడా దృష్టి సారించేలా కృషి జరిగింది.

**ప్ర I.7 కొత్త ఆదాయపు పన్ను బిల్లు కోసం చేపట్టిన కసరత్తు పరిధి ఏమిటి?**

**జవాబు:** ఆదాయపు పన్ను చట్టం-1961 సమగ్ర సమీక్ష ఉద్దేశం చట్టాన్ని 'క్లుప్తంగా, స్పష్టంగా, చదవడానికి, అర్థం చేసుకోవడానికీ అనువుగా సులభంగా' రూపొందించడమే అని 2024 జూలైలో బడ్జెట్ ప్రసంగం సందర్భంగా గౌరవనీయ ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.

**ప్ర I.8 ప్రస్తుత నిబంధనలను క్లుప్తంగా, స్పష్టంగా సులభంగా చదివి అర్థం చేసుకోవడానికి అనువుగా రూపొందించడం కోసం పాటిస్తున్న ప్రాథమిక నియమాలు ఏమిటి?**

**జవాబు:** ప్రస్తుతం ఉన్న నిబంధనలను సరళతరం చేయడానికి కింది ప్రాథమిక నియమాలను పరిగణనలోకి తీసుకున్నారు:

**i.** అనావశ్యకమైన నిబంధనలను తొలగించి, చట్టం పరిమాణాన్ని దాదాపు సగం వరకు తగ్గించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది.

**ii.** కొత్త బిల్లులో రచనా శైలి సూటిగా, స్పష్టంగా ఉంది. ఆదాయపు పన్ను చట్టం-1961లో ఉన్న 18 పట్టికలతో పోలిస్తే.. 57 కన్నా ఎక్కువ పట్టికలను చేర్చడం ద్వారా నిబంధనలను

సులభంగా అర్థం చేసుకోగలిగేలా రూపొందించారు. మినహాయింపులు, వివిధ రకాల ఏర్పాట్ల కోసం మినహాయింపు నిబంధనలు, వివరణలపై ఆధారపడడానికి బదులు..ఉప విభాగాలను, క్లాజులను ఉపయోగించారు. ఒకే అంశానికి వర్తించే నిబంధనలన్నింటినీ ఒకే చోట క్రోడీకరించడం ద్వారా ఇది ప్రతినిర్దేశాలను (క్రాస్ రిఫరెన్సులు), వైరుధ్యాలను తగ్గిస్తుంది.

**iii.** అన్ని నిబంధనలను (దాదాపు 1200), వివరణలను (దాదాపు 900) తొలగించారు.

**iv.** 1961 చట్టంలో విభాగాలు, ఉప విభాగాలు, క్లాజులు, సబ్ క్లాజులు, అంశాలు, ఉప అంశాలకు సంబంధించి అనేక ప్రతినిర్దేశాలు (క్రాస్ రిఫరెన్సులు) ఉన్నాయి. దాంతో నిబంధనలపై వ్యాఖ్యానించడం సవాలుగా పరిణమించింది. సెక్షన్ ను ప్రస్తావించడం ద్వారానే నిబంధనలను ఉల్లేఖించే అవకాశాన్ని కల్పిస్తూ.. ఈ కొత్త బిల్లు సరళతరమైన నిర్దేశక విధానాన్ని అనుసరిస్తుంది. ఉదాహరణకు.. కొత్త బిల్లులోని సెక్షన్ 133 (1)(b)(ii) ప్రస్తుత చట్టంలోని సెక్షన్ 133 ఉపవిభాగం(1) లోని క్లాజు (b)లోని సబ్ క్లాజు (ii)ను పోలి ఉంటుంది.

**V.** ఈ బిల్లులో ఒక ముఖ్యమైన అంశమేమిటంటే 'గత సంవత్సరం', 'మదింపు సంవత్సరం' అనే భావనలను తొలగించడం. 1989కి ముందు ఈ భావనలను తీసుకొచ్చారు. ఎందుకంటే పన్ను చెల్లింపుదారులకు.. ప్రతీ ఆదాయ మార్గానికీ సంబంధించి గడిచిన ఏడాదిగా పరిగణించే పన్నెండు నెలల వ్యవధి వేర్వేరుగా ఉండేది. 1989 ఏప్రిల్ 1 నుంచి అన్ని సందర్భాల్లోనూ 'గత సంవత్సరం' భావనను ఆర్థిక సంవత్సరమన్న భావనతో అనుసంధానం చేశారు. అయితే చట్టం కింద వివిధ వ్యవహారాల కోసం 'మదింపు సంవత్సరం' భావనను వినియోగిస్తున్నారు. ఆ విధంగా పన్ను చెల్లింపుదారు 'గత సంవత్సరం', 'మదింపు సంవత్సరం' అన్న రెండు విభిన్న కాలవ్యవధులను అనుసరించాల్సి వచ్చేది. ఇది చట్టంలోని నిబంధనలను పాటించడంలో, ముఖ్యంగా కొత్త పన్ను చెల్లింపుదారులకు ఇబ్బందులను కలిగించింది. 'గత సంవత్సరం', 'మదింపు సంవత్సరం', అలాగే 'ఆర్థిక సంవత్సరా'న్ని కూడా వారు అనుసరించాల్సి వచ్చింది.

### ప్ర I.9 కొత్త బిల్లును రూపొందించే సమయంలో భాగస్వాములతో సంప్రదింపులేవైనా చేశారా?

**జవాబు:** ఈ సరళీకరణ ప్రక్రియ కోసం సమగ్ర సంప్రదింపుల విధానాన్ని అనుసరించారు. సరళతరం చేయడం, అనావశ్యకమైన అంశాల తొలగింపునకు సంబంధించి ఆన్లైన్ ద్వారా మొత్తం 20,976 సలహాలు అందాయి. వాటిని విశ్లేషించి.. ఔచిత్యంగా ఉన్న సూచనలను విధాన సంబంధిత, భాషా సరళీకరణ, అనవసర లేదా కాలం చెల్లిన నిబంధనల తొలగింపు వంటి పలు విభాగాలుగా వర్గీకరించారు. పరిశ్రమలు, వృత్తినిపుణుల సంఘాలతో సమావేశాలు నిర్వహించారు. ఈ దిశగా ఆదాయపు పన్ను శాఖ పరిధిలో క్షేత్ర స్థాయి మేధోమథన సదస్సులు జరిగాయి.

అంతర్జాతీయ స్థాయిలో.. ఇటీవలి కాలంలోనే ఇలాంటి చర్యలు చేపట్టిన ఆస్ట్రేలియా పన్ను కార్యాలయం, ట్రెజరీతోపాటు యూకే పన్ను సరళీకరణ కార్యాలయం వంటి కొన్ని పన్ను ఆధీకృత సంస్థలతో సంప్రదింపులు జరిపారు.

ఈ చర్యలు చేపట్టే సమయంలో 2009, 2019 సంవత్సరాల్లో రూపొందించిన పత్రాలను కూడా పరిశీలించారు. న్యాయపరమైన భాషను సరళీకరించడం కోసం న్యాయ మంత్రిత్వ శాఖకు చెందిన శాసన విభాగం జారీ చేసిన 'చట్టాల సరళీకరణ కోసం ముసాయిదా నిర్దేశం' వంటి అంతర్జాతీయ, జాతీయ మార్గదర్శకాలను అధ్యయనం చేశారు.

### ప్ర I.10 సరళీకరణ చర్యలను నిర్వహించడంలో ఏ ప్రక్రియలను అనుసరించారు?

**జవాబు:** ప్రశ్న **I.9**లో పేర్కొన్న భాగస్వామ్య సంప్రదింపుల ప్రక్రియకు అదనంగా.. పన్ను చెల్లింపుదారులు, పరిశ్రమలు, వృత్తి నిపుణుల సంఘాలు, శాఖకు చెందిన క్షేత్ర స్థాయి అధికారుల నుంచి సలహాలు స్వీకరించారు. ఈ శాఖకు చెందిన దాదాపు 150 మంది అధికారులతో కూడిన కమిటీ మొత్తం ప్రక్రియలో క్రియాశీలకంగా పాల్గొంది. ఈ కమిటీ వివిధ అధ్యాయాల ముసాయిదా పాఠాన్ని రూపొందించగా; న్యాయ మంత్రిత్వ శాఖకు చెందిన శాసన విభాగం దానిని నిశితంగా పరిశీలించి అవసరమైన అనుమతుల అనంతరం తుది బిల్లు రూపంలో క్రోడీకరించింది .

కొత్త బిల్లును ఖరారు చేయడం కోసం ఈ బృందం 60,000 కన్నా ఎక్కువ పనిగంటలను కేటాయించింది.

### ప్ర I.11. కొత్త బిల్లులో రీడబులిటీ (చదవడానికి వీలుగా ఉండటం) ఎలా మెరుగుపడింది?

**జవాబు:** సంప్రదాయ న్యాయ పారిభాషిక పదాలకు భిన్నంగా, సరళమైన భాషను ఉపయోగించడం ద్వారా పన్ను చట్టాన్ని చదవడానికి వీలుగా చేశారు. వివిధ భిన్నమైన అంశాలు ఒకేచోట చేర్చిన సందర్భాల్లో ఆ విభాగాలను వివరణాత్మకంగా పొందుపరిచారు. సాధ్యమైన చోట టేబుల్ ఫార్మాట్లను విరివిగా ఉపయోగించారు. టీడీఎస్ నిబంధనలను పట్టిక రూపంలో పొందుపరిచారు. సుమారు 150 క్లాజులతో కూడిన సెక్షన్ 10 వంటి కొన్ని నిబంధనలను షెడ్యూళ్లలో ఉంచి పట్టికల రూపంలో చేర్చారు. ఈ సమగ్ర కసరత్తు ఫలితంగా, కొత్త బిల్లు పరిమాణం విషయంలో సగానికి పైగా తగ్గింది. మరోవైపు నిబంధనలను క్రోడీకరించి ప్రజలకు అనుకూలంగా ఉండే విధానంలో ప్రవేశపెట్టారు.

### ప్ర I.12. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టంలోని షరతులు, వివరణలు, విధానపరమైన అంశాల పరిస్థితి ఏమిటి?

**జవాబు :** నిబంధనలు (1200 కంటే ఎక్కువ), వివరణలు (900 కంటే ఎక్కువ) తొలగించారు. అందులోని అంశాలను సరళీకృతంగా మార్చి సబ్ సెక్షన్లు, క్లాజులుగా పొందుపరిచారు. సాధ్యమైనంత వరకు, విధానపరమైన అంశాలు, నిర్దిష్ట వివరాలను నిబంధనల రూపంలో అందించాలని ప్రతిపాదించారు.

## ప్ర I.13. ఆదాయపు పన్ను చట్టం-1961 లోని అనవసర నిబంధనలను కొత్త ఆదాయపు పన్ను బిల్లులో తొలగించారా?

**జవాబు :** అవును, తొలగించారు. కొన్నేళ్లుగా అనేక సవరణలు లేదా విధాన మార్పుల కారణంగా కొన్ని నిబంధనలు నిరుపయోగంగా మారాయి. దీంతో చట్టంలో ఇలాంటి నిబంధనలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఉదాహరణకు 2012-13 మదింపు సంవత్సరం నుంచి ఫ్రీ ట్రేడ్ జోన్లలో కొత్తగా ఏర్పాటైన పారిశ్రామిక సంస్థలకు ప్రత్యేక నిబంధన అయిన సెక్షన్ 10A కింద మినహాయింపు అందుబాటులో లేదు. ఇలాంటి కాలం చెల్లిన నిబంధనలను బిల్లు నుంచి తొలగించారు. మునుపటి మదింపు సంవత్సరాలకు వర్తించే నిబంధనలను రద్దు, సేవింగ్స్ ప్రొవిజన్ల ద్వారా నిర్వహించనున్నారు.

## ప్ర I.14. కొత్త బిల్లుపై స్పష్టతను పెంచడానికి ఇంకా ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

**జవాబు :** కొత్త బిల్లులో స్పష్టత పెంచేందుకు నిబంధనలు, వివరణలు, అనవసర నిబంధనల తొలగింపుతో పాటు ఫార్ములాలు, పట్టికలు, స్ట్రక్చర్లను ఉపయోగించారు. సాధ్యమైనంత మేరకు ప్రస్తుత చట్టంలోని వివిధ చాప్టర్లలో ఉన్న అవే అంశాలకు సంబంధించిన నిబంధనలను క్రోడీకరించారు, పునరుక్తిని తొలగించారు, అనేక చోట్ల నిర్వచనాలను ఏకీకృతం చేశారు. లాభాపేక్షలేని సంస్థలకు (ఎన్‌పీఓలు) సంబంధించిన నిబంధనల విషయంలో, వాటికి సంబంధించిన మొత్తం అంశాలను క్రోడీకరించి 7 ఉప భాగాలుగా రూపొందించారు. ఇందులో రిజిస్ట్రేషన్, ఆదాయం, వాణిజ్య కార్యకలాపాలు, సమ్మతి, ఉల్లంఘనలు, విరాళాల అర్హత, వివరణలకు సంబంధించిన నిబంధనలు ఉన్నాయి.

## ప్ర I.15. కొత్త ఆదాయపు పన్ను బిల్లు రూపకల్పనలో పన్ను కచ్చితత్వ సూత్రాలు ఏవిధంగా పాటించారు?

**జవాబు :** ప్రస్తుతం అమలులో ఉన్న ఆదాయపు పన్ను చట్టం- 1961 తో పోలిస్తే కొత్త ఆదాయ పన్ను బిల్లును సగానికి కుదించారు. వివిధ సెక్షన్లలో నిబంధనలను పెద్ద మొత్తంలో పునర్వ్యవస్థీకరించారు. సరళీకరణ ప్రక్రియ చేపడుతున్న సమయంలో, వివాదాల పరిధిని తగ్గించడానికి, కొత్త వివరణల పరిధిని తగ్గించడానికి ప్రయత్నించారు. ఈ కింది ప్రయోజనాల కోసమే ఇవి చేశారు:

**a.** కీలక పదాలు/పదబంధాలను, ముఖ్యంగా న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చిన చోట కనీస మార్పులను చేపట్టారు.

**b.** సాధ్యమైనంత వరకు చిన్న వాక్యాలను ఉపయోగించడం ద్వారా భాషను సరళీకృతం చేశారు.

**c.** విభాగాలను పట్టికలలో వరుస లేదా ఉప వరుసలుగా అనువదించి, పదాల సంఖ్యను తగ్గించి స్పష్టతను తీసుకువచ్చారు.

**d.** భిన్న వివరణలు వచ్చే అవకాశం తగ్గించడానికి నిబంధనలను స్పష్టంగా రూపొందించారు. నిబంధనలు, వివరణలు తొలగించి సులభమైన పదాలతో సబ్ సెక్షన్లు, క్లాజులుగా ఉంచారు.

**e.** పన్ను కచ్చితత్వాన్ని నిర్ధారించడానికి అంతర్జాతీయ పన్నులకు సంబంధించిన నిబంధనలను విస్తృతంగా చర్చించారు.

**f.** స్వచ్ఛంద సంస్థ అంశానికి సంబంధించిన చాప్టర్‌లో సరళమైన భాషను ఉపయోగించి మరింత సమగ్రంగా రూపొందించారు.

**g.** మినహాయింపు సెక్షన్లు... ఉదాహరణకు ప్రస్తుత చట్టంలోని సెక్షన్ 10 వంటి వాటిని పట్టికల ద్వారా సులభతరం చేశారు. షెడ్యూళ్లలో ఎక్కువ సంఖ్యలో నిబంధనలను పొందుపరిచారు.

**h**. సాధ్యమైన చోట స్పష్టతను పెంచడానికి ఫార్ములాలు, పట్టికలను ఉపయోగించారు.

**i.** ప్రస్తుత చట్టంలోని వివిధ అధ్యాయాల్లో ఉన్న అవే అంశాలు, నిర్వచనాలతో కూడిన నిబంధనలను సాధ్యమైనంత మేరకు క్రోడీకరించారు.

## ప్ర I.16. అధ్యాయాలు, విభాగాలు పదాల సంఖ్య పరంగా కొత్త బిల్లుకు, ఆదాయపు పన్ను చట్టం- 1961 కి మధ్య తేడా ఏమిటి?

**జవాబు :** ప్రస్తుత ఆదాయపు పన్ను చట్టంతో పోలిస్తే కొత్త బిల్లులో చెప్పుకోదగ్గ మార్పులు కనిపించాయి.

| వివరాలు | ఆదాయపు పన్ను చట్టం- 1961 | ప్రతిపాదిత చట్టం |
|---|---|---|
| చాప్టర్లు | 47 | 23 |
| సెక్షన్లు | 819* | 536 |
| పదాలు | 5.12 లక్షలు | 2.60 లక్షలు |

* వర్తించే సెక్షన్లు

వీటితో పాటు 1200 నిబంధనలను, 900 వివరణలను తొలగించారు.

## ప్ర I.17. ఆదాయపు  పన్ను చట్టం- 1961లో 819 సెక్షన్లు ఉండగా, చట్టంప్రతి 298 వరకు సెక్షన్లను మాత్రమే ప్రస్తావిస్తోంది. దేని ఆధారంగా ఇలా చేశారు?

జవాబు : ఆదాయపు  పన్ను చట్టం- 1961లో పలు సవరణలు జరిగాయి. పలు విధాన నిర్ణయాలను ప్రత్యేక నిబంధనలుగా పొందుపరిచారు. చాలాసార్లు ఇలాంటి నిబంధనలను ఇప్పటికే ఉన్న సెక్షన్లకు అనుసంధానం చేసి, తదనుగుణంగా కొత్త సెక్షన్లను ప్రస్తుతం ఉన్న సెక్షన్లకు కొనసాగింపుగా చేశారు. ఉదాహరణకు ప్రత్యేక కేసుల విషయంలో విధించే పన్నులకు సంబంధించిన పలు నిబంధనలను 115 AC, 115AD, 115JB, 115VP వంటి 115 సిరీస్ ల్లో   చూపిస్తూ వచ్చారు. ఫలితంగా ఆదాయపు  పన్ను చట్టం-1961లో మొత్తం 819 సెక్షన్లు అమల్లో ఉన్నాయి.

## ప్ర I.18. కొత్త బిల్లులో ఇంకా 536 సెక్షన్లు, 2.6 లక్షల పదాలు ఎందుకు ఉన్నాయి?

**జవాబు :** ప్రస్తుత ఆదాయపు పన్ను చట్టంలో 298 సెక్షన్లు ఉండగా, మొత్తం ఉప విభాగాలు కలుపుకొని 819 ఉన్నాయి. ఎందుకంటే సంఖ్యాపరమైన సెక్షన్ నెంబర్లు కాకుండా 115ఎ నుంచి 115డబ్ల్యుఎమ్ (117 సెక్షన్లు) వంటి ఆల్ఫా - న్యూమరికల్ కోడ్లు ఉన్న విభాగాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఆదాయపు పన్ను చట్టం కేవలం పన్ను విధింపునకు సంబంధించినది మాత్రమే కాదు, ఇది పన్ను నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను కలిగి ఉన్న సమగ్ర పత్రం. ఇది కింద పొందుపరిచిన ఇతర అంశాలను కూడా కలిగి ఉంటుంది:

**a)** పన్ను విధింపునకు సంబంధించిన ఫ్రేమ్ వర్క్ ను రూపొందించడం: పన్ను మదింపు అధికారులు, పన్ను చెల్లింపుదారులు, పన్ను వసూలు చేసే వర్గాలు , వృత్తి నిపుణులకు బాధ్యతలను కేటాయించడం.

**b)** ఆదాయ నిర్ధారణ, కాలపరిమితి, అప్పీలేట్ విధానాలు, అమలు, మదింపులు, జరిమానాల కోసం ఫ్రేమ్ వర్క్ ను ఏర్పాటు చేయడం.

**c)** దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ప్రభావితం చేసే ఆర్థిక విధానాలపై వ్యాఖ్యానాల/వివరణల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవడం.

పైన పేర్కొన్న అవసరాల నిమిత్తం కొత్త బిల్లులో 536 సెక్షన్లను ప్రతిపాదించారు. ఇంకా, కొత్త బిల్లులోని అనేక విభాగాలు ప్రధానంగా ప్రస్తుతం అమలులో ఉన్న పన్ను విధానంలోని అంశాలను నెరవేర్చడానికి పొందుపర్చారు. వీటిలో కనీస ప్రత్యామ్నాయ పన్ను (MAT), వివిధ పన్ను తగ్గింపులు, మినహాయింపులు మొదలైన వాటికి సంబంధించిన నిబంధనలు ఉన్నాయి. ఆయా నిబంధనలు అమల్లోకి వచ్చే వరకు ఈ పాత చట్టం అమల్లో ఉంటుంది. అందువల్ల, విధాన, చట్టపరమైన అంశాలకు ఇబ్బందిలేకుండా, సజావుగా మారడానికి ఇవి కొత్త బిల్లులో భాగంగా ఉంటాయి.

## ప్ర I.19. సరళీకరణ ప్రక్రియ గణనీయమైన మార్పులకు దారితీస్తుందా?

**జవాబు :** సరళీకరణ ప్రక్రియలో ఇతర విషయాలతో పాటు, కింది అంశాలుంటాయి.

**i.** ఆదాయపు  పన్ను చట్టంలోని అనవసర నిబంధనలను తొలగించారు.

**ii.** మినహాయింపు నిబంధనలు, వివరణలపై ఆధారపడకుండా సబ్ సెక్షన్లు, క్లాజులను ఉపయోగించారు.

**iii.** సెక్షన్లు, సబ్ సెక్షన్లు, క్లాజులు మొదలైన వాటిని క్రాస్ రెఫరెన్సింగ్ చేయడానికి సరళీకృత వ్యవస్థను ఉపయోగించారు.

**iv.** మరింత స్పష్టత కోసం పట్టికలు, ఫార్ములాలను విస్తృతంగా ఉపయోగించారు

**v.** ఒకే అంశానికి సంబంధించి వివిధ సెక్షన్లు/ చాప్టర్లలో ఉన్న నిబంధనల ఏకీకరణ చేశారు.

ఆర్థిక బిల్లు- 2025లో ప్రతిపాదించిన సవరణలతో సహా, ఆదాయ పన్ను చట్టం- 1961 లో క్రమం తప్పకుండా సవరణలు జరుగుతున్నందున, ఈ చట్టాన్ని విధానపరమైన అంశాలతో నవీకరించారు. ఆర్థిక బిల్లు 2025 వరకు ప్రతిపాదించిన అన్ని సవరణలను కొత్త ఆదాయపు పన్ను బిల్లు 2025 లో పొందుపరిచారు. అందువల్ల, బిల్లులో విధానపరమైన పెద్ద మార్పులు చేయనప్పటికీ, పై అంశాలు ప్రస్తుత చట్టంలో ప్రతిపాదిత స్థూల మార్పులకు దారితీశాయి.

## ప్ర I.20. పాత, కొత్త సెక్షన్ల మ్యాపింగ్ అందుబాటులో ఉంటుందా?

**జవాబు :** సెక్షన్ల వారీగా మ్యాపింగ్ ను ఆదాయ పన్ను శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు.

## ప్ర I.21: ఈ బిల్లులో "గత సంవత్సరం", "మదింపు సంవత్సరం" అనే పదాలను ఎలా నిర్వచించారు?

**జవాబు :** "గత సంవత్సరం",
"మదింపు సంవత్సరం" అనే పదాల స్థానంలో "పన్ను సంవత్సరం" అనే పదాన్ని ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం ఆదాయపు పన్ను విధించే కాలపరిమితి గాని, మదింపు గాని ఏ సంవత్సరంలో పన్ను విధిస్తారో ఆ ఆర్థిక సంవత్సరానికే చెంది ఉంటుంది. ఇందులో ప్రతిపాదించిన "పన్ను సంవత్సరం" అనే పదం తేలిగ్గా అర్థమవుతుంది. ప్రపంచంలోని చాలా దేశాలు పన్ను చెల్లింపు, మదింపు కాలపరిమితి రెండింటికీ ఒకే పదాన్ని ఉపయోగిస్తున్నారు. అదే "పన్ను సంవత్సరం".
"పన్ను సంవత్సరం" అనే పదం ప్రవేశపెట్టడంతో స్థూలంగా ఈ దిగువ సూత్రాలను అనుసరిస్తున్నారు.

**i.** "పన్ను సంవత్సరం"
: పన్ను విధించదగిన సమయం. ఒక నిర్దిష్ట సమయంలో జరిగిన లావాదేవీలు, ఆదాయం అన్నింటికీ ఈ పదం వర్తిస్తుంది.

**ii.** "ఆర్థిక సంవత్సరం"
: పన్ను చెల్లించేందుకు, విధానపరమైన అంశాలకు సంబంధించిన కాలపరిమితి.

## ప్ర I.22: టీడీఎస్, టీసీఎస్ నిబంధనలను కొత్త బిల్లులో ఏ విధంగా సరళీకరించారు?

**జవాబు :** తేలిగ్గా అర్థమయ్యేందుకు వీలుగా టీడీఎస్, టీసీఎస్ నిబంధనలను పట్టికల రూపంలో పొందుపరిచారు. పన్ను చెల్లింపు కోసం దేశీయ పౌరులు, ప్రవాసులకు వేర్వేరు పట్టికలున్నాయి. రెండు వర్గీకరణల్లోని వారికి మూల స్థానంలో పన్ను మినహాయించాల్సిన అవసరం ఉండదు. ఉదాహరణకి అద్దెపై టీడీఎస్ కు సంబంధించిన ప్రతిపాదిత నిబంధనలను ఈ దిగువ పట్టికలో పొందుపరిచారు.

| 2. | **అద్దె** | | |
|---|---|---|---|
| **క్రమ సంఖ్య** | **ఆదాయం స్వభావం** | **చెల్లింపుదారు** | **పన్ను రేటు గరిష్ఠ పరిమితి** |
| (i) | అద్దె రూపంలో ఆదాయం | నిర్దేశిత వ్యక్తి కాకుండా ఇతరులు | రేటు :<br>2% గరిష్ఠ పరిమితి : నెలకు లేదా నెలలో కొంత సమయానికి రూ.50,000 |

(ఈ బిల్లులో ప్రతిపాదిత 393 సెక్షన్‌లో ఈ పట్టిక ప్రస్తావన ఉంది)

## ప్ర I.23: లాభాపేక్ష రహిత సంస్థలకు సంబంధించిన నిబంధన సరళీకృతం చేసేందుకు ఏం చేశారు?

**జవాబు :** లాభాపేక్ష రహిత సంస్థలకు సంబంధించిన నిబంధనలు ప్రస్తుత చట్టంలోని వివిధ సెక్షన్లలో ఉన్నాయి. ఆ నిబంధనలున్న విభాగాల్లో సెక్షన్ 11, సెక్షన్ 12, సెక్షన్ 12A, సెక్షన్ 12AA, సెక్షన్ 12AB, సెక్షన్ 13, సెక్షన్ 115 BBC, సెక్షన్ 115 BBI, సెక్షన్ 115 TD, సెక్షన్ 115 TE, సెక్షన్ TF ఉన్నాయి. ఈ నిబంధనలన్నీ చట్టంలోని 80 G (5) సెక్షన్‌లోని ప్రథమ, ద్వితీయ నిబంధనల కింద అనుమతులకు లోబడి ఉన్నాయి. ఈ బిల్లులో వీటన్నింటినీ సరళీకృతం చేసి ఒకే అధ్యాయంలో పొందుపరిచారు. రిజిస్టర్ అయిన లాభాపేక్ష రహిత సంస్థలకు వర్తించే నిబంధనలన్నింటినీ ఈ కొత్త బిల్లులో XVII అధ్యాయం పార్ట్ బిలోని "B-రిజిస్టర్ అయిన లాభాపేక్ష రహిత సంస్థల ప్రత్యేక నిబంధనలు" శీర్షిక దిగువన పొందుపరిచారు.

ప్రస్తుతం: అధ్యాయాల వారీగా విభజించిన నిబంధనలు

**నమోదిత లాభ రహిత సంస్థ పదాన్ని ఉపయోగించడం**

గందరగోళాన్ని నివారించడం కోసం ట్రస్ట్, సంస్థ, విశ్వవిద్యాలయం, విద్యా సంస్థ, ఆసుపత్రి మొదలైనవి రీప్లేస్ చేయడం

**అధ్యాయం I**
**జిపియూ విషయంలో వాణిజ్య కార్యకలాపాలు: సెక్షన్ 2(15) సంబంధిత నిబంధన**

అధ్యాయం III
సెక్షన్స్ 10(23C), 11, 12, 12A, 12AA, 12AB, 12AC & 13

అధ్యాయం VIA
సెక్షన్ 80G

అధ్యాయం XII
సెక్షన్ 115BBC
సెక్షన్ 115BBI

అధ్యాయంXIIEB
సెక్షన్ 115TD, 115TE, 115TF

ప్రతిపాదించినవి:
అన్ని నిబంధనలు ఒకే భాగములో (XVII-B)
. రిజిస్ట్రేషన్
. ఆదాయం
. వాణిజ్య కార్యకలాపాలు
. సమ్మతి
. ఉల్లంఘనలు
. విరాళాల కోసం ఆమోదం వివరణలు

**అన్ని వివరణలు, నిబంధనల తొలగింపు**
కేవలం సెక్షన్ 11లోనే 13 వివరణలు, 16 నిబంధనలు ఉన్నాయి.

**పట్టికలు:**
. రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు
. పన్ను విధించదగ్గ ప్రత్యేక ఆదాయం, పన్ను సంవత్సరం
. సమకూర్చుకున్న ఆదాయంపై పన్ను మదింపు

**సమర్ధంగా తయారుచేయడం (రూపొందించడం) వల్ల తగ్గిన క్రాస్ రిఫరెన్స్ లు**

**అనవసర నిబంధనల తొలగింపు**

## ప్ర I.24: వేతనం పొందుతున్న ఉద్యోగులు అనే పదాన్ని కొత్త బిల్లులో ఏ విధంగా సరళీకరించారు?

**జవాబు :** పన్ను చెల్లింపుదారులు తేలిగ్గా అర్థం చేసుకునేందుకు వీలుగాను, ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేసే సమయంలో విభిన్న సెక్షన్లు పరిశీలించాల్సిన అవసరం లేకుండాను వేతనానికి సంబంధించిన అన్ని నిబంధనలు ఒకే చోట పొందుపరిచారు. ఆదాయపు పన్ను చట్టం 1961 సెక్షన్ 10 కింద గతంలో మినహాయింపులు ఇస్తున్న గ్రాట్యుటీ, లీవ్ ఎన్కాష్మెంట్, పెన్షన్ కమ్యుటేషన్, వీఆర్ఎస్ కింద నష్టపరిహారం అన్నింటినీ ఇప్పుడు వేతనం అనే అధ్యాయంలో భాగం చేశారు. హెచ్ఆర్ఏ వంటి కొన్ని అలవెన్సులను ఇప్పుడు కొత్త బిల్లులోని షెడ్యూల్ IIలో చేర్చారు. వేతనానికి సంబంధించిన నిబంధనల్లో వీటి ప్రస్తావన ఉంది. కొన్ని పట్టికలు, ఫార్ములాలు చేర్చడం ద్వారా చట్టంలోని నిబంధనలు తేలిగ్గా చదువుకునే సౌలభ్యం కల్పించడం దీని లక్ష్యం. ప్రోత్సాహకాలకు వర్తించే పన్నులన్నింటినీ చట్టంలో యథాతథంగా కొనసాగిస్తూ ఇవి పన్ను చెల్లింపుదారులందరికీ వర్తించని కారణంగా వాటి మదింపు, షరతులు, మినహాయింపులు అన్నింటినీ నిబంధనల విభాగంలోకి మార్చారు. అలాగే చదవడానికి మరింత సౌలభ్యంగా ఉండేందుకు కాలం చెల్లిపోయిన, పునరావృతం అయిన నిబంధనలన్నింటినీ తొలగించారు.

## ప్ర I.25: నిర్దిష్ట ఆదాయాలు, వ్యక్తులకు సంబంధించిన మినహాయింపుల్లో ఏం

**మార్పులుచేశారు?**

**జవాబు :** తేలిగ్గా పరిశీలించడానికి, నిబంధనలు పాటించడానికి వీలుగా ప్రత్యేక వర్గీకరణలోకి వచ్చే నిర్దిష్ట ఆదాయాలు, వ్యక్తులు అందరినీ ప్రత్యేక షెడ్యూళ్ల పరిధిలోకి తెచ్చారు

| | |
|---|---|
| **షెడ్యూల్ II (16 వరుసలు)** | వ్యవసాయ సంబంధిత ఆదాయం వంటి మినహాయింపు గల ఆదాయాలు |
| **షెడ్యూల్ III (39 వరుసలు)** | •నిర్దిష్ట ఆధాయాలపై మినహాయింపు కోసం అర్హులైన నిర్దిష్ట వ్యక్తులు అనగా సంస్థల భాగస్వాములు, హెచ్‌యుఎఫ్ మొదలైనవారు. |
| **షెడ్యూల్ IV (14 వరుసలు)** | •ప్రవాసుల కోసం మినహాయింపులు |
| **షెడ్యూల్ V (8 వరుసలు)** | •వ్యాపార ట్రస్టులు, సావరిన్ వెల్త్ ఫండ్స్ మొదల్లైన వాటికి మినహాయింపు |
| **షెడ్యూల్ VI (12 వరుసలు)** | •ఐఎఫ్ఎస్‌సీ యూనిట్‌లకు మినహాయింపులు |
| **షెడ్యూల్ VII (48 వరుసలు)** | •పన్ను మినహాయింపు గల వ్యక్తులు |

షెడ్యూళ్లకు సంబంధించిన ఉదాహరణ పరిశీలించండి.

| క్రమ సంఖ్య | అర్హత గల వ్యక్తులు | షరతులు |
|---|---|---|
| **A** | **B** | **C** |
| **1.** | కేంద్ర సాయుధ దళాలు ఏర్పాటు చేసిన రెజిమెంట్ నిధి లేదా నాన్ - పబ్లిక్ ఫండ్ | అలాంటి నిధి ఏదైనా సాయుధ దళాల్లో గతంలో పని చేసిన వారు, ప్రస్తుతం పని చేస్తున్న వారు లేదా వారిపై ఆధారపడిన వారి సంక్షేమం కోసం ఏర్పాటు చేసినదై ఉండాలి. |

(షెడ్యూళ్ళకు సంబంధించిన ప్రస్తావన బిల్లులోని సెక్షన్ 11లో ఉంది)

### ప్ర I.26: కొత్త బిల్లు ప్రవేశపెట్టిన తర్వాత తదుపరి చర్యలేమిటి?

**జవాబు :**

**తొలి దశ :** బిల్లును పార్లమెంట్ ఆమోదించిన అనంతరం చట్టం అవుతుంది.

**రెండో దశ :** చట్టానికి సంబంధించిన నిర్వహణ, అధికార విధివిధానాలు

**i.** కొత్త నిబంధనలు, ఫారాల నోటిఫికేషన్

**ii.** సమాంతరంగా వివిధ పాలనాపరమైన, పాక్షిక న్యాయ విధుల నిర్వహణకు సహాయపడే వ్యవస్థలు, విధానాలను నెలకొల్పడానికి అవసరమైన సాఫ్ట్‌వేర్ అభివృద్ధి.

## ప్ర I.27: పాత, కొత్త నిబంధనల మధ్య సమన్వయం ఎలా?

**జవాబు :** ఆయా సంవత్సరాల్లో అనుసరించాల్సిన నిబంధనలకు సంబంధించిన విభిన్న అంశాలను కొత్త బిల్లులోని రద్దులు, పొదుపు క్లాజ్‌లలో ప్రస్తావించారు. దీని వల్ల పాత చట్టం కింద పన్ను చెల్లింపుదారులకు గల హక్కులు, బాధ్యతలు అన్నింటికీ రక్షణ కలుగుతుంది.

## ప్ర I.28: కొత్త బిల్లులో రేట్లు, ఇతర విధానాలకు సంబంధించి ఏం మార్పులున్నాయి?

**జవాబు :** రేట్లకు సంబంధించి ఎలాంటి మార్పులు లేవు. విధానపరంగా చూసినా కూడా ఆదాయపు పన్ను చట్టం 1961కి ఎప్పటికప్పుడు సవరణలు చేయడంతో పాటు ఫైనాన్స్ బిల్లు, 2025లో కూడా కొన్ని మార్పులు ప్రతిపాదించడం వల్ల చట్టం అప్‌డేట్‌గానే ఉంది. ఫైనాన్స్ బిల్లు 2025లో ప్రతిపాదించిన సవరణలన్నింటినీ కూడా కొత్త ఆదాయపు పన్ను బిల్లు 2025లో పొందుపరిచారు. అందువల్ల బిల్లులో విధానపరంగా కూడా చెప్పుకోదగ్గ మార్పులేవీ చేయలేదు. పైన పేర్కొన్న అంశాలన్నీ కూడా ప్రస్తుత చట్టంలో "వాస్తవిక" మార్పులకు దారి తీశాయి.

## ప్ర I.29: నూతన ఆదాయపు పన్ను బిల్లును, గతంలో అమలులో ఉన్న నిబంధనలను సరిపోల్చి చూస్తుంటే "వర్చువల్ డిజిటల్ ఆస్తులు" వంటి కొన్ని అంశాల్లో కొన్ని మార్పులున్నట్టు అనిపిస్తోంది. ఎందుకు?

**జవాబు :** ఫైనాన్స్ బిల్లు 2025లో ప్రతిపాదించిన సవరణలన్నీ ఆదాయపు పన్ను బిల్లు 2025లో ఉన్నాయి. అందుకే ఆదాయపు పన్ను బిల్లు 2025ని చదివే సమయంలో ఆదాయపు పన్ను చట్టం 1961లోని నిబంధనలు, ఫైనాన్స్ బిల్లు 2025లో ప్రతిపాదిత సవరణలతో సరిపోల్చుకోవలసిందిగా సూచించడమైనది. ఆదాయపు పన్ను బిల్లు 2025లో "వర్చువల్ డిజిటల్ ఆస్తుల" పరిధికి సంబంధించి ఎలాంటి మార్పులు చేయలేదు. ఫైనాన్స్ బిల్లు 2025లో ప్రతిపాదించిన సవరణలన్నింటినీ ఈ బిల్లులో ప్రస్తావించిన నిర్వచనంలో పొందుపరిచారు.

## ప్ర I.30: సరళీకరణ ప్రక్రియలో భాగంగా ఆదాయపు పన్ను చట్టం 1961లోని ఏయే అధ్యాయాల్లో పదాలను భారీగా కుదించారు

**జవాబు** : ప్రస్తుతం అమలులో ఉన్న ఆదాయపు పన్ను చట్టం 1961లో మొత్తం పదాల సంఖ్య 5.12 లక్షలుండగా కొత్త ఆదాయపు పన్ను బిల్లు 2025లో మొత్తం పదాల సంఖ్య 2.6 లక్షలుంది. కొన్ని అధ్యాయాల్లో పదాల సంఖ్య గణనీయంగా తగ్గించారు. అవి ఇలా ఉన్నాయి.

| ఆదాయపు పన్ను చట్టం-1961 | ఆదాయపు పన్ను బిల్లు-2025 | |
|---|---|---|

| అంశం | పదాలు | అంశం | పదాలు | పదాల సంఖ్య కుదింపు |
|---|---|---|---|---|
| మినహాయింపు సంబంధిత నిబంధనలు | 30000 | మినహాయింపు సంబంధిత నిబంధనలు | 13500 | 16500 |
| టీడీఎస్/టీసీఎస్ | 27453 | టీడీఎస్/టీసీఎస్ | 14606 | 12847 |
| లాభాపేక్ష రహిత సంస్థ | 12800 | లాభాపేక్ష రహిత సంస్థ | 7600 | 5200 |